ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet
Edition
బుధవారం 11 ఫిబ్రవరి 2026 www.prajaswaramdaily.com 4 PM

# డాక్టర్ శ్రీలీల..

## ఎంబీబీఎస్ పూర్తి చేసిన నటి

హైదరాబాద్, ప్రజాస్వరం

డాక్టర్ కాబోయి యాక్టర్ అయిన వారు చాలామంది ఉన్నారు. కానీ, నటిగా రాణిస్తూనే శ్రీలీల ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తాజాగా వైద్య పటా అందుకున్నారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అభిమానులు, పలువురు నెటిజన్లు ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.



# ఎలాంటి సమస్యలు లేవు

**అక్కడక్కడ చెదురుమదురు ఘటనలు**

**సాయంత్రానికి పోలింగ్ శాతం పెరిగే అవకాశం: ఎస్ఈసీ రాణికు ముదిని**

హైదరాబాద్ , ప్రజాస్వరం

పండుగ వాతావరణంలో పోలింగ్ జరుగుతోందని, చెదురుమదురు ఘటనలు తప్ప ఎలాంటి సమస్యలు లేవని ఎస్ ఈసీ రాణికు ముదిని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మందకొడిగా సాగుతోందని తెలిపారు. వందశాతం వెబ్ కాస్టింగ్ తో పోలింగ్ జరుగుతోందని వెల్లడించారు. సాయంత్రానికి పోలింగ్ శాతం పెరుగుతుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. వెబ్ కాస్టింగ్ అనేది ఓటు వేయాలని అవగాహన కల్పించడమేనన్నారు.



# కొడంగల్ లో ఓటేసిన రేవంత్.. మధిరలో భట్టి

**మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుంటున్న ప్రముఖులు**

**మంచిర్యాలలో మంత్రి వివేక్**

**కేంద్రమంత్రి బండి సంజయ్**

**సాయంత్రం 5 గంటలకు ముగియనున్న పోలింగ్**

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణలోని 116 మున్సిపాలిటీలలో ఉదయం 7 గంటల నుంచి పోలింగ్ కొనసాగుతోంది. పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కు వినియోగించుకుంటున్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొడంగల్ లో ఓటు వేశారు. వికారాబాద్ జిల్లాలోని కొడంగల్ జడ్పీ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ కు వెళ్లి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ఆయన హైదరాబాద్‌కు తిరిగి బయల్దేరారు.





కాసేపట్లో ఆయన శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కి చేరుకుని ఢిల్లీకి వెళతారని సమాచారం. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కరీంనగర్ జ్యోతి నగర్ లోని ఎస్సార్ హై స్కూల్ కేంద్రంలో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంచిర్యాలలోని హైటెక్‌సిటీలో 227వ నంబర్ పోలింగ్ బూత్‌లో మంత్రి వివేక్ వెంకటస్వామి ఓటు వేశారు. కామారెడ్డి పట్టణంలోని 151 పోలింగ్ బూత్ లో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ ఆలీ ఓటు హక్కును వినియోగించుకున్నారు. రాష్ట్రంలోని ఏడు కార్పొరేషన్లు, 116 మున్సిపాలిటీలకు జరుగుతున్న ఈ పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగియనుంది.

# ఎస్ఈసీ కార్యాలయాన్ని సందర్శించిన సీఈవో

హైదరాబాద్, ప్రజాస్వరం

తెలంగాణ ఎన్నికల కమిషనర్ కార్యాలయాన్ని తెలంగాణ ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి బుధవారం సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ కారణంగా పోలింగ్, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లపై సుదర్శన్ రెడ్డికి ఎస్ఈసీ రాణి కుముదిని వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ అమలు చేస్తున్న విధానాన్ని ఆయన పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో జరిగే ప్రతి కదలికను జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయం నుంచి వీక్షిస్తున్నారా లేదా అని ఎస్ఈసీ రాణి కుముదినిని అడిగి తెలుసుకున్నారు.



ఈ సందర్భంగా సీఈవో సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ... వెబ్ కాస్టింగ్ వల్ల పారదర్శకత పెరుగుతుందని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది అయినా వెంటనే తెలుస్తుందన్నారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ద్వారా ఓటర్లను గుర్తించామని, ఇప్పటి వరకు 55 శాతం మ్యాపింగ్ పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎస్ఐఆర్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అసలు ఓట్లపై స్పష్టత ఉందని, రెండు రాష్ట్రాల వలస ఓటర్ల లెక్క తేలుతుందన్నారు. చనిపోయిన వారి ఓట్ల తొలగింపు కొంత ఆలస్యమయిందని సీఈవో సుదర్శన్ రెడ్డి తెలిపారు.

# కరీంనగర్‌లో ఉద్రిక్తత

**బీజేపీ కార్యకర్తలపై పోలీసుల లాఠీఛార్జి..**

కరీంనగర్, ప్రజాస్వరం

**కరీంనగర్ జిల్లా పరిషత్ వద్ద గుమిగూడిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. ఈక్రమంలో ఆరుగురు కార్యకర్తలకు గాయాలయ్యాయి. పోలీసుల తీరును నిరసిస్తూ వారు నడిరోడ్డుపై బైఠాయించారు. 58వ డివిజన్‌లో దొంగ ఓట్లు వేయిస్తున్నారని చెబుతుంటే.. పోలీసులు తమపై లాఠీ ఛార్జి చేయడమేంటని మండిపడ్డారు.**

# సీఐ కాంగ్రెస్ అభ్యర్థి గల్లా పట్టుకున్నారు

**జగ్గారెడ్డి**

**సంగారెడ్డి, ప్రజాస్వరం**



పట్టణంలోని 34వ వార్డు పోలింగ్ కేంద్రం వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ కేంద్రం వద్ద విధుల్లో ఉన్న సీఐ.. 34 వార్డు కాంగ్రెస్ అభ్యర్థి గల్ల పట్టుకున్నారని ఆరోపిస్తూ సీనియర్ నేత జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామంటూ బూత్‌లోకి దూసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులు, జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి మండిపడ్డారు. సీఐని సస్పెండ్ చేయకపోతే ఎన్నికలు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

# వీధి లైట్లు కూడా నోచని పట్టణాలున్నాయి

**కేంద్రమంత్రి కిషన్**

హైదరాబాద్, ప్రజాస్వరం

నేడు తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలు అభివృద్ధి చెందాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ఓటర్లకు పిలుపునిచ్చారు. ఓటరు మహాశయులకు నమస్కారం అంటూ ఎక్స్ వేదికగా ఓటర్లను ఉద్దేశించి ఒక ప్రకటన విడుదల చేశారు.

గత 12 ఏళ్ల బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని కిషన్ రెడ్డి ఆరోపించారు. ప్రస్తుతం పట్టణాలు కనీసం వీధి లైట్లకు కూడా నోచుకోని దుస్థితికి చేరుకున్నాయని, ప్రజలు నిత్యం ఏదో ఒక సమస్యతో సతమతమవుతున్నారని ఆయన పేర్కొన్నారు.



బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులకు ప్రజాధనాన్ని కొల్లగొట్టడం, మజ్లిస్–మైనార్టీ ఓట్లపై దృష్టి పెట్టడం తప్ప ప్రజా సమస్యలను పరిష్కరించాలనే ఆలోచన ఏమాత్రం లేదని ఆయన తీవ్రంగా విమర్శించారు. దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వానికి అండగా నిలవాలని, మున్సిపాలిటీల సమగ్రాభివృద్ధి కోసం బీజేపీ అభ్యర్థులను ఆశీర్వదించాలని కిషన్ రెడ్డి ప్రజలను కోరారు.

# 3.గంటలకు 62.09శాతం ఓటింగ్

హైదరాబాద్, ప్రజాస్వరం

మున్సిపల్ ఎన్నికల పోలింగ్ .. మధ్యాహ్నం మూడు గంటల వరకు 62.09 శాతం నమోదు అయినట్లు ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 5 గంటల తర్వాత క్యూలో నిల్చున్న వారికి ఏ సమయం అయినా ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు. పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. కాంగ్రెస్ పై బీఆర్ఎస్.. బీఆర్ఎస్ పై కాంగ్రెస్ నేతలు ఆరోపణలు చేసుకుంటున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద కొంత ఉద్రిక్త ప రిస్థితులు నెల కొన్నాయి. పోలీసు బందోబస్తు చ ర్య లు తీసుకోవ డంతో ప రిస్థితి అదుపులోనే ఉంది.

